# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-12-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది.**

2. **రాష్ట్రంలో మొబైల్ అనుసంధానం లేని గ్రామాల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళుతోందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **రాష్ట్రానికి ప్రత్యేకమైన ఒంగోలు జాతి పశువుల సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు.**

4. **రాష్ట్రంలో అన్నీ విభాగాల్లో నేరాల రేటు తగ్గిందని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు.**

5. **ఖతార్‌లోని దోహాలో జరిగిన చెస్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర క్రీడాకారిణి కోనేరు హంపి కాంస్య పతకం సాధించారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం కొనసాగుతోంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో మూడు కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు పలు జిల్లాల రెవెన్యూ డివిజన్ల మార్పు వంటి అంశాలపై మంత్రివర్గం చర్చిస్తోంది. అలాగే రాజధాని అమరావతిలో ఏర్పాటు కానున్న పలు సంస్థలకు ఆమోదం తెలపడంతోపాటు రెండో విడత ల్యాండ్ పూలింగ్ అంశంపై సమావేశంలో చర్చించి, ఆమోదించే అవకాశముందని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రాన్ని మురికివాడల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విశాఖ నగరంలోని స్థానిక మురికివాడలను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్.. 27 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో మొబైల్ అనుసంధానం లేని గ్రామాల సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర

కార్యాచరణతో ముందుకు సాగుతోందని కేంద్ర  కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఇండస్ట్ అవర్స్ నిర్వాహకులు మొబైల్ టవర్స్ ఏర్పాట్లపై ఇబ్బందులను ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో మొబైల్ అనుసంధానం లేని 414 గ్రామాలకుగానూ 120 గ్రామాల్లో డిజిటల్ భారత్ నిధి పథకం కింద 120 కోట్ల రూపాయల వ్యయంతో కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటుకు పనులు చేపట్టినట్లు వివరించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తిచేయాలని గడువును నిర్ణయించినట్లు తెలిపారు. డిజిటల్ ఇండియా లక్ష్యాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కేంద్రమంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రానికి ప్రత్యేకమైన ఒంగోలు జాతి పశువుల సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో స్థానిక పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయులుతో కలిసి మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో 2025 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో భారతదేశం సాధించిన  పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం..

2025 భారతదేశ ఆర్థిక రంగ విస్తృతి, ప్రపంచ ఆశయాల వైపు మళ్లిన సంవత్సరంగా నిలిచింది. ఆగస్టు 15న ప్రధానమంత్రి నరేంద్ర  మోదీ సంస్కరణల కోసం ఇచ్చిన పిలుపు 21వ శతాబ్దపు భారతదేశం కోసం చట్టాలను పునఃరూపకల్పన చేయాల్సిన ఆవశ్యకతను  ప్రతిబింబించాయి. భారతదేశ వృద్ధిలో కార్మికులను కేంద్ర స్థానంలో నిలపేలా ఈ ఏడాది 4 కొత్త  కార్మిక  కోడ్ లు అమలులోకి వచ్చాయి. అలాగే సరళమైన, మరింత నిష్పక్షపాతమైన, పారదర్శకమైన ఆర్థిక వ్యవస్థ కోసం తదుపరి తరం జీఎస్టీ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జన్ విశ్వాస్ సంస్కరణలు ప్రభుత్వం, వ్యాపారాల మధ్య పరస్పర సంబంధ విధానాన్ని పునర్నిర్మించాయి.

---------------------------

రాష్ట్రంలో అన్నీ విభాగాల్లో నేరాల రేటు తగ్గిందని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో వార్షిక నేరాల నివేదికపై ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ,  రహదారి  ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.  సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో వాటి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ఏర్పాటు చేసిన ఈగల్ వ్యవస్థ సమర్ధవంతంగా పనిచేస్తోందని డిజిపి వివరిస్తూ,

వాయిస్ .. 25  సెకన్లు

--------------------------

ఎర్నాకుళం వెళ్లే టాటా-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ ఏసీ బోగిలలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో ఒకరు మృతి చెందారని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి అనకాపల్లి జిల్లా ఎస్పీ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రమాదంపై అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించారని అన్నారు. రైలులోని దాదాపు అందరూ ప్రయాణికులు క్షేమంగా బయటకు వచ్చారని, ఒకరు మృతిచెందారని చెప్పారు. మృతుడిని చంద్రశేఖర్ సుందరంగా గుర్తించామని ఎస్పీ తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

ఖతార్‌లోని దోహాలో జరిగిన ఫిడే మహిళల ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్లో, రాష్ట్రానికి చెందిన భారత సీనియర్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. హంపి 11 రౌండ్లలో 8.5 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచారు. ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమెకు ఇది ఐదో పతకం. దీనితో ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో 5 సార్లు పతకాలు సాధించిన మహిళగా ఆమె ఘనత సాధించారు.కోనేరు హంపి విజయంపై రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అభినందనలు తెలిపారు. హంపి విజయాలు దేశానికి గర్వకారణమని, మహిళా క్రీడాకారిణులకు ఆమె స్ఫూర్తిదాయకంగా నిలిచారని ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు.

--------------------------

భవిష్యత్తు తరాల కోసం జల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జాతీయ జల శాస్త్ర సంస్థ సంచాలకులు డాక్టర్ వై ఆర్ ఎస్ రావు కోరారు. విజయవాడలో జరుగుతున్న “జలశక్తి హ్యాకథాన్ 2025”లో కేంద్ర భూగర్భ జలాల శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్ జ్యోతి కుమార్‌తో కలిసి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ, భూగర్భ జలాల తగ్గుదల, నీటి నాణ్యత, సంరక్షణ, నిర్వహణ పద్ధతులపై ఈ హ్యాకథాన్‌లో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. నీటి సంరక్షణ-వాన నీటి సేకరణ, చెరువులు, బావుల వంటి సంప్రదాయ జలవనరుల పునరుద్ధరణ, నీటి పునర్వినియోగం, అడవుల పెంపకం వంటి లక్ష్యాల సాధనకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని వివరించారు.

=====================